


# చెరలాట

గంట నుంచీ సాగుతూనే ఉన్నాయి మాటలు.

రాత్రి పదకొండు దాటింది.

చూపులు నేలకానించి కూర్చుంది వసంత. తలెత్తి అన్న వైపు చూసింది. క్షణం క్రితం అన్న మాటలే మళ్లీ అన్నాడు రఘు. ''ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏదో ఓ వ్యాపకం కావాలి దానికి''

గోడవారగా బెంచి మీద నారాయణ, వసంత తండ్రి. పడుకుని వున్నాడు. ఆయన కాళ్ల దగ్గర రఘు, అతని తమ్ముడు సూర్యం...వేరే స్టూలు మీద తల్లి ఆదిలక్ష్మి.. నేలమీద వసంత ఇద్దరు వదినెలూ..సీతా, ఛాయా.

''దాని ఖర్మమిలా వుంది. పెళ్లయి ఎనిమిదేళ్లు. నిండా కాపరం చేసిన కాలమేదీ? నెలల తరబడి దాన్నిక్కడ దించి బలాదూరు తిరగటమేగా ఆ మొగుడు చేసిన నిర్వాకం'' చీర చెంగుతో కళ్లొత్తుకుంది ఆదిలక్ష్మి.

వసంత మనసుని చాలా ప్రశ్నలు ముసిరాయి.

చదివింది ఇంటరు. ఎంతో కొంత సంపాదించాల్సిందేనని నానా యాగీ చేశారు అత్తామామలు. వసంత బయటికి పోవటం ఇష్టం లేదు భర్త ప్రసాదరావ్‌కి. చివరికి ఒకటి రెండు తరగతుల పిల్లలకి ఇంట్లోనే పాఠాలు చెప్పుకుంటూ వచ్చిన నాలుగు రాళ్లూ అత్త చేతికిచ్చేయాల్సి వచ్చింది.

''ప్రత్యేకమైన వ్యాపకమేం దొరుకుతుంది. మళ్లీ ఆ ట్యూషన్లు చెప్పుకోవాలి అంతేగా'' ఆదిలక్ష్మి.

''ఆ..ఆ..వచ్చేది ఒక పూట తిండిక్కూడా చాలదు'' సూర్యం అన్నాడు.

వింటున్నది వసంత. తలెత్తి ఎందుకో తండ్రి కేసి చూసింది. ఆయన నిద్రపోతున్నాడో మెలకువగా వున్నాడో తెలీటం లేదు.

''ఆ అవస్థేదో నేను పడతాను చూద్దాం'' అన్నాడు సూర్యం. ఈ మాటలంటూ భార్య ఛాయ వైపు చూశాడు. ఆమె 'ఔను' అన్నట్టు కళ్లు చికిలించింది.

కొన్ని నిమిషాలు మౌనంలోకి జారుకున్నాయి.

సూర్యం ఛాయా లేచారు. వీళ్ల వెనగ్గా రఘూ, సీతా కదిలారు. వసంత లేచి, ఉన్న లైట్ ఆఫ్ చేసి, జీరో వోల్ట్ లైట్ వేసింది. వెళ్లి గోడవారగా చాపమీద నడుం వాల్చింది. ఆమె పక్కకి వచ్చి తానూ పడుకుంది ఆదిలక్ష్మి.

వసంత ఆలోచనల్లో-

ఆమె చిన్న బతుకు పుస్తకం బరువుగా తెరచుకుంది.

గవర్నమెంట్ ఉద్యోగం కాచుక్కూర్చుందని మభ్యపెట్టి కొడుక్కి పెళ్లి చేసింది అత్త తాయారమ్మ. అరవై వేల కట్నం గుంజింది. నారాయణ సర్వమూ కోల్పోయిన రాజరాజులా అయిపోయాడు. దగ్గూ ఆయాసం మాత్రం ప్రాణస్నేహం చేస్తున్నాయి. మూడు, నెలలయ్యేసరికీ అన్ని బండారాలూ బయటపడ్డాయి. ప్రసాదరావు వెలగబెట్టింది డిగ్రీ ఫస్టియర్ వరకే! ఉద్యోగం లేదు. సినిమా హాళ్లనీ, హోటళ్లనీ, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల్నీ- తిప్పి తిప్పి కొట్టేశాడు.

తనకు- అత్త ఆరడీ, కలతలూ, కన్నీరూ!

అమ్మపోరు భరించలేని ప్రసాదరావు పెళ్లాన్ని పుట్టింట్లో దించటం బలాదూర్ తిరగటం!

ఏడాది క్రితం-

ఒకరోజు జ్వరంతో మొదలై అనారోగ్యంగా మారి త్వరత్వరగా వ్యాధిగా స్థిరపడింది ప్రసాదరావు పరిస్థితి. టెస్టులు అయ్యాయి. ఎయిడ్స్ అన్నారు. అటువారూ ఇటువారూ ఇరుగుపొరుగూ తనకు నరకమే చూపించారు. ఖర్చులో ఖర్చుగా- సూర్యం అన్నయ్యే తనకూ టెస్టులు చేయించాడు. తరుగులో మెరుగు...తనకేం కాలేదు.

మూడు నెలలు ఆయనకి అన్నీ మంచంలోనే! వ్యాధితో తీసుకు తీసుకుపోయాడు. ప్రసాదరావు మరణం అందరికీ రిలీఫే!

నెల రోజులైంది.. ఈ నెల నుంచీ ఇదీ వరస. వంద ప్రశ్నలూ, వేయి చర్చలూ...

పక్క గదిలో అలికిడి. మాటలు, ఒంటిరాయి వరస గోడ. అదీ పైకప్పుని తాకదు. అందుకనే స్పష్టంగా వినిపిస్తాయి మాటలు.

వసంత ఆలోచన తెగింది. పక్కకి మసిలింది.

''ఈ పిల్లకి ఏదో ఓ ఉద్యోగం కుదర్చగలిగితే ఆమెతోపాటు మీ అమ్మానాన్నల్నీ పంపించవచ్చు. తర్వాత మీ అన్నయ్యా వాళ్లూ, మనమూ- ఎవరి దారి వాళ్లం చూసుకోవచ్చు. ఏమంటారు?'' వదిన ఛాయ అంటోంది.

గతుక్కుమన్నది వసంత. ఆదిలక్ష్మి మసిలింది.

వసంత మేధలో పెద్ద విస్ఫోటనం. అంటే, ఒక్క దెబ్బకి ఇన్ని పిట్టలా? మనుషుల ఆంతర్యాలిలా బయట పడుతున్నాయి అనిపించింది.

అసలు తనకి ఏం ఉద్యోగం దొరుకుతుంది? దొరికినా తాను చేయగలదా? పొట్టకూటి కోసం...? తన ముందున్న బతుక్కి ఇదేనా పరిష్కారం? ఇదా జీవితం అంటే? ఎన్నెన్నో ప్రశ్నలు... ఇరవై ఆరేళ్ల వయసు వసంతకేమీ జవాబులివ్వటం లేదు. అస్థిమితంగా అటూ ఇటూ పొర్లి అమ్మ పొట్ట మీద చెయ్యి వేసింది. దగ్గరగా జరిగి పడుకుంది. ఆమె చెయ్యి తల్లి చెంపకు తగిలింది. అక్కడంతా కన్నీరే! ఆదిలక్ష్మి కూడా అదే అనుభూతిలోకి జారింది. వసంత రెప్పల కింద తడిస్పర్శ!

''పిచ్చిపిల్ల!'' అని ఆత్మీయంగా కూతుర్ని అక్కున పొదువుకుంది ఆదిలక్ష్మి.

రాత్రి గడుస్తోంది.

పాతగడియారం రెండు కొట్టింది. అంటే మూడు గంటలయినట్టు! వెనకబాటుతనం!

నారాయణ దగ్గు తెరలో వున్నాడు!

★ ★ ★

వసంతకి ఉద్యోగం వచ్చింది. విజయవాడలో ఒక పేథలాజికల్ లేబ్‌లో. అది సూర్యంకి తెలిసిన ఓ పెద్దాయన మేనేజ్‌మెంట్‌లో వుంది. నెలకి మూడు వేలు జీతం. అక్కడ ఆమె రిసెప్షనిస్టు.

పది రోజుల్లో చిన్న ఇల్లు చూశారు. గుంటూరు నుంచి విజయవాడకి మారింది నివాసం. నారాయణా ఆదిలక్ష్మీ- వసంతతో వచ్చారు. అన్నావదినెలు తమ ప్రణాళికను చాకచక్యంగానే అమలు చేశారు. వేదాంతిలా నవ్వుకుంది వసంత.


రోజులు గడుస్తున్నాయి.

ఉద్యోగానికి అలవాటు పడింది వసంత. ల్యాబ్ వాతావరణం హడావిడిగా వున్నా ఉత్సాహంగానే వుంది వసంతకి. కొత్త పరిచయాలూ ఏర్పడ్డాయి.

ఆమె పక్కసీటు ఎకౌంటెంట్ కిషోర్‌ది. సౌమ్యంగా ఉంటాడు. వసంతకొచ్చే ఫోన్‌కాల్స్‌లోనూ సహాయం చేస్తుంటాడు. కస్టమర్స్ ప్రశ్నలు మరీ ఇబ్బందికరంగా వుంటే తానే సమాచారం వివరాలు అందిస్తూ వుంటాడు.

కిషోర్ నుంచీ ఎంతో నేర్చుకుంటున్నాననే భావన వసంతది.

కిషోర్ వసంతల పరిచయం స్నేహమైంది. స్నేహం అభిమానంగా మారింది. అభిమానం ఆరాధనా భావంగా పెరిగింది. ఆరాధన దగ్గరితనమైంది. ఒకరి కష్టసు ఖాల్ని ఒక రికి చెప్పుకోసాగారు. చనువులోనే అవ్యక్తభావ ప్రసారమూ జరుగుతోంది. ఆ భావం పేరేమీ అనుకోలేదు ఇద్దరూను!



వసంత తానేమిటో సూచనప్రాయంగా కిషోర్‌కి అనేక సందర్భాల్లో వెల్లడి చేసింది.

ఒకరోజు కిషోర్ తన గురించి చెప్పుకొచ్చాడు. తల్లీ, ముగ్గురు చెల్లెళ్లు. తండ్రి లేడు. చెల్లెళ్ల పెళ్లిళ్లు అయిపోయాయి. కుటుంబ వ్యవహారాలవలన తను పెళ్లి గురించి ఆలోచించలేదు. టౌన్‌కి దగ్గరగానే కొంత భూవసతి వుంది. కొలుకిచ్చాడు. వన్‌టౌన్‌లో ఇల్లు వుంది. ఒక పోర్షన్‌లో తనూ తల్లీ వుంటున్నారు. మరో పోర్షన్ అద్దెకిచ్చారు. నెలకో మూడు వేల ఆదాయం వస్తుంది. ఇదంతా చెప్పి- ''మన మధ్య దూరం లేదనే భావం కలుగుతోంది'' అన్నాడు.

మౌనంగా అతన్ని చూస్తూ వుండిపోయింది వసంత.

ఇంకొక రోజు-

రాత్రి ఇంటికి వస్తూ కలిసి నడిచారు. దారిలో హోటల్‌కి వెళ్లారు. కాఫీ తాగుతూ అన్నాడు- ''మా అమ్మకి నా పెళ్లి దిగులు పట్టుకుంది'' అని.

నిముషాలు మౌనంగా గడిచాయి.

వెళ్దామని లేచింది వసంత.

ఆదివారం-

వసంత ఇంటికొచ్చాడు కిషోర్. నారాయణ, ఆదిలక్ష్మితో పిచ్చాపాటి అయిన తర్వాత వసంతనుద్దేశించి ''మీకభ్యంతరం లేక

పోతే మనం పెళ్లి చేసుకుందాం'' అన్నాడు.

వసంతేమీ ఆశ్చర్యపోలేదు. ఆమె అమ్మానాన్నలే. ఒక్క క్షణం మ్రాన్పడి అంతలోనే తెప్పరిల్లారు.

తన మాటలకి కొనసాగింపుగా అన్నాడు కిషోర్- ''మా అమ్మకి ఇంటి పట్టున వుండే పిల్ల కోడలుగా కావాలి'' అని ఆ వెంటనే వసంత వైపు చూస్తూ- ''అందుకని మీరు... ఉద్యోగం...'' నాన్చేడు.

నారాయణ ఆదిలక్ష్మి మొహమొహాలు చూసుకున్నారు. వసంతేమో ముగ్గుర్నీ మార్చి మార్చి చూస్తూ కూర్చుంది.

ఆ చిన్న గది పెద్ద మౌన గాంభీర్యంతో చిన్నపోయింది.

కిషోర్ చొరవకి ఒకింత ఆశ్చర్యం కలిగింది వసంతకి. ఈ ప్రతిపాదనకి ఎందువల్లనో మనసులో అస్థిమితత్వం చోటు చేసుకుందామెకి.

ఆ తర్వాత కొద్దిసేపటికి-

అడిగి మరీ మరో కాఫీ తాగి, సెలవు తీసుకున్నాడు కిషోర్.

ఆ పగలంతా వసంతకి మనసు మనసులో లేదు.

రాత్రి భోజనం దగ్గర ఈ ప్రసక్తి తెచ్చింది ఆదిలక్ష్మి. ''ఏమోనమ్మా! నీ విషయమంతా తెలుసునంటివి. అయినా పెళ్లి చేసుకోవటానికిలా ముందుకు రావటం బాగానే వుంది కానీ, కాస్త నిదానంగా ఆలోచించుకో. మేడిపండు లోకం. పోయి పోయి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు కాకూడదు గదా'' అన్నది.

నారాయణ ఏమీ అనలేదు. పెద్దగా మాటలూ సాగలేదు.

అర్ధరాత్రి-

అమ్మానాన్నా ఏదో ఊసులాడుకుంటున్నట్టుంటే మెలకువ వచ్చింది వసంతకి. విన్నది.

''దాని మంచో చెడో తర్వాతగానీ ముందు మనిద్దరి గతేమిటో ఆలోచించుకోవాలిగా''

ఒళ్లంతా ఆవిర్లు వచ్చాయి వసంతకి.

మేధలో ఎన్నెన్నో ఆలోచనల విస్ఫోటనం.

అత్తమామల ఇంట్లో-ఆనాడు-ఉద్యోగం లేకపోవటం పెద్ద లోపం. ఆ తర్వాత- అన్నావదినలకు భారమై ఉద్యోగం చేయాల్సి రావటం అవసరం. ఇవాళ- తనకున్న చిన్నపాటి ఉద్యోగం కూడా మానేయాలనేది కిషోర్ షరతు!

చిత్రమైన పరిస్థితి! ఈ పరిస్థితిలో మరో మలుపు- అమ్మానాన్నల బతుకు భయం, వాళ్ల ఆలోచన! సమస్యకి కొత్త కోణం!

ఉన్నట్టుండి వసంత మెదడులో ఒక ప్రశ్న మొలిచింది. 'అసలు నా భవిష్యత్తు గురించిన నిర్ణయం ఎవరిది? వీళ్లందరిదీనా? అయితే, వీళ్లందరి ఆంతర్యాల్ని ఎలా అర్థం చేసుకోవాలి?

అసలు మనుషులు ఒకరికొకరు అర్థమవుతారా? ప్రసాదరావుకి తానూ, తనకు ప్రసాదరావు అర్థమయ్యారా? అతను తన వారికీ, తాను తన వారికీ అర్థమయ్యారా?

ఏమిటీ నాటకమూ, పాత్ర పోషణా?

తన ప్రశ్నలకి తానే ఉలిక్కిపడింది వసంత.

చాపమీద లేచి కూర్చుంది. మోకాళ్ల మీద చేతులానించి గుడ్డి వెలుగులో దిక్కులు చూడసాగింది.

మిగిలిన రాత్రంతా ఆమెకి నిద్రలేదు.

-ఆ తర్వాతి ఆదివారం సాయంత్రం-

వసంతని తన ఇంటికి తీసుకువెళ్లాడు కిషోర్. తల్లిని పరిచయం చేశాడు.

ఆమెని చూసి షాక్ తిన్నది వసంత. కళ్లు తిరిగినట్టయింది. నిలవరించుకుంది.

ఆ తల్లికి పక్షవాతం. ఏడాది నుంచీ మంచం బతుకు(ట). తల్లీకొడుకులు వివరాలేవో చెప్తున్నారు.

వసంతకి తల దిమ్మెక్కిపోయింది. ఇందుకా తనను ఉద్యోగం మానేయమనేది. క్షణంలో సగంసేపు తెలియని భావోద్వేగానికి లోనయింది. కళ్లు విచ్చి ఆ ఇద్దర్నీ చూస్తూ లేచి నిలబడింది వసంత.

ఆశ్చర్యం!

తన కాళ్ల మీదే తాను నిలబడి వుంది.

వడివడిగా బయటికి అడుగులు వేసింది.

దిశ్చక్రం చాలా చాలా రంగుల్ని వెలారుస్తోంది!



## తమన్నా కోరిక

**మిల్కీవైట్ భామ తమన్నా ఇప్పుడు తమిళ సినీ ఫీల్డులో బిజీ బిజీగా వుంది కదా! అయితే ఆమెకి ఓ కోరిక వుందిట. అది సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ఒక్క సినిమాలో అయినా కలిసి నటించాలనిట. 'రజనీసార్ లాంటి హీరోతో నటించాలని ఎవరికుండదు చెప్పండి. ఆయనతో కనీసం ఒక్కటంటే ఒక్క సినిమా చేసినా చాలు. అది చిన్న వేషం అయినా పర్వాలేదు కానీ రజనీగారితో నటించాను అని చెప్పుకోవడానికి వుంటుంది! అలాంటి థ్రిల్లింగ్ చాన్స్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నాను' అంటుంది తమన్నా. మరి ఈ ముద్దుగుమ్మ కోరిక తీరేదెప్పుడో!**